# ప్రజలకు అత్యాధునిక వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయం

**●స్థానికంగానే వైద్య పరీక్షలు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, సెప్టెంబర్ 09(నేటి దర్శిని);** ప్రజలకు అత్యాధునిక వైద్య పరీక్షలు ప్రజలకు అందుబాటులోకి తేవడం అభినందనీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్తికేయ డయాగ్నస్టిక్ సెంటర్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రాంరెడ్డి, జాతీయ మాజీ ఓబీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి, పొల్యూషన్ బోర్డ్ సభ్యుడు బాలాసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఆమనగల్లు ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య పరీక్షల సదుపాయాలు స్థానికంగానే అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమన్నారు. గతంలో వివిధ రకాల వైద్య పరీక్షల కోసం ప్రజలు హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఆమనగల్లులోనే మెరుగైన డయాగ్నస్టిక్ సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లో పరీక్షలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రాంరెడ్డి కార్తికేయ డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటును అభినందించారు. ఆమనగల్లు ప్రాంతంలో వైద్య రంగానికి సంబంధించిన సదుపాయాలు మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రైవేట్ వైద్య సంస్థలు కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని ఆకాంక్షించారు. తక్కువ ధరలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మిడ్జిల్‌లో వైభవంగా గండికోట మైసమ్మ బోనాలు

**●భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ..**



**మిడ్జిల్, సెప్టెంబర్ 9, (నేటి దర్శిని ):** మిడ్జిల్ మండల కేంద్రంలో గండికోట మైసమ్మ బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకుని బోనాలు ఎత్తుకుని అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

బోనాల ఊరేగింపుతో మండల కేంద్రంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. డప్పుల మోతలు, భక్తుల జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని గండికోట మైసమ్మ తల్లిని వేడుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.గండికోట మైసమ్మ బోనాల సందర్భంగా మిడ్జిల్ మండల కేంద్రం భక్తజన సందోహంతో కళకళలాడింది. సంప్రదాయాలు, ఆధ్యాత్మికత, భక్తిభావం కలగలిసిన ఈ వేడుకలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



# ఆమనగల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**ఆమనగల్లు, సెప్టెంబర్ 09(నేటి దర్శిని);** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో గురువారం గురువందన కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ విద్యా కమిటీ చైర్మన్ లయన్ ఎన్.సుధీర్ రెడ్డి తెలిపారు.కడ్తాల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నామని,ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరుగుతుందని తెలియజేశారు.ఉత్తమ ఉపాధ్యాయులకు అందించే అవార్డులను పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ ఎస్. నరేందర్ రెడ్డి, ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ జి.చెన్న కిషన్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి అందజేయనున్నట్లు కార్యక్రమం చైర్మన్ లయన్ జంగయ్య, కో చైర్మన్ లయన్ కె గోవర్ధన్ రెడ్డి తెలియజేశారు. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు ఐదు మండలాలను ఎంపిక చేసింది. ఆమనగల్లు మండలం నుండి ఉత్తమ ఉపాధ్యాయులుగా బి.యాదయ్య రిషి హై స్కూల్, ఏ. శ్రీరాములు సెయింట్ జాన్స్ స్కూల్, ఏ. ఆరోగ్యమేరి మండల పరిషత్ పాఠశాల ఆకుతోటపల్లి, ఏలే. ఉమామహేశ్వరి చెన్నకేశవ కాలనీ, షహవార్ ప్రాథమికోన్నత పాఠశాల విఠాయిపల్లి,కడ్తాల్ మండలం నుండి నలుగురు ఉపాధ్యాయులను, మాడుగుల మండలం నుండి నలుగురు ఉపాధ్యాయులని, తలకొండపల్లి మండలం నుండి ముగ్గురు ఉపాధ్యాయులు, కల్వకుర్తి మండలం నుండి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు క్లబ్ సెక్రటరీ లయన్ గంగుల శ్రీనివాసరెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ బండేల రామచంద్రారెడ్డి, క్లబ్ పిఆర్ఓ ఎంఏ. పాష తెలిపారు. ఉపాధ్యాయులను గౌరవించడం ద్వారా విద్యారంగానికి, సమాజ అభివృద్ధికి వారు అందిస్తున్న సేవలను గుర్తించి ప్రోత్సహించడమే గురు వందన కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

## ఆమనగల్లు మండల
# రైతులకు కీలక సూచన..

**●సన్న వడ్ల బోనస్‌కు నేడే చివరి గడువు**

**●మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ గౌడ్**



**ఆమనగల్లు సెప్టెంబర్ 09(నేటి దర్శిని):** తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న వరి రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించేందుకు పంట నమోదు ప్రక్రియ చేపట్టింది. ఆమనగల్లు మండలంలోని రైతులు సెప్టెంబర్ 10లోగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ప్రభుత్వం గుర్తించిన 7 ప్రాధాన్యత వరి రకాలు RNR 15048 (తెలంగాణ సోనా), BPT 5204 (సాంబా మసూరి), KNM 1638, HMT సోనా, జై శ్రీరామ్, WGL 44, KNM 7715. ఈ రకాలను సాగు చేసిన రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్లను సంప్రదించి ఆన్‌లైన్‌లో పంట వివరాలను నమోదు చేసుకోవాలి. యూనివర్సిటీ లేదా ఇతర రైతుల నుంచి విత్తనాలు తీసుకుని సాగు చేసిన వారు తమ పరిధిలోని AEOలను సంప్రదించి నమోదు చేసుకోవచ్చు. నమోదు చేసిన రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసే సమయంలో బోనస్ మొత్తాన్ని నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. నమోదు చేసుకోని రైతుల ధాన్యానికి కొనుగోలు సమయంలో బోనస్ వర్తించదని వ్యవసాయ అధికారులు తెలిపారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**●కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి**

**● బిఆర్ఎస్ ఎమ్మెల్సీల దిష్టిబొమ్మ దహనం**



**ఆమనగల్లు,సెప్టెంబర్ 09(నేటి దర్శిని):** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆమనగల్లులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఎమ్మెల్సీల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ పదవికి అవమానకరమన్నారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని సూచించారు. రాజకీయ విభేదాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో విమర్శలు చేయాలే తప్ప వ్యక్తిగతంగా,కులపరంగా అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్సీలు తమ వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం,కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, జిల్లా నాయకులు వస్పుల మానయ్య, ధనుంజయ్య,కాలే మల్లయ్య,శ్రీధర్ రెడ్డి,రాగ్య నాయక్, ఐఎన్ టియుసి జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్,గాజుల సురేష్,అలీమ్, దేవరశెట్టి మహేష్,కండె సాయి, సురేష్ నాయక్, శ్రీకాంత్, ఫరీద్, శ్రీను నాయక్, మహేష్ , నాజర్, కుమార్ గౌడ్, రఫీ,గుద్దేటి శివ, రవి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.'

# కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం



జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్



**మిడ్జిల్, సెప్టెంబర్ 9, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** తెలంగాణ ప్రజాకవి, సాహితీవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కాళోజీ తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలను సమాజం ముందుకు తీసుకువచ్చిన గొప్ప ప్రజాకవి అని అన్నారు. అన్యాయం, అసమానతలు, సామాజిక రుగ్మతలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథం వంటి కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలను సానుభూతితో పరిష్కరించి సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, అశోక్ కుమార్, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులు అర్పించారు.

## కాళోజీ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

● కలెక్టరేట్‌లో ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు




**మిడ్జిల్,సెప్టెంబర్ 9 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాళోజీ తన కవిత్వం, రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం, సామాజిక స్పృహను పెంపొందించారని కొనియాడారు. తెలంగాణ సమాజంలో ఆయన నింపిన స్ఫూర్తి చిరస్మరణీయమని పేర్కొంటూ, కాళోజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల, ఏ.ఓ. సువర్ణ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.'

## కేటీఆర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీ ఫిర్యాదు



**ఆమనగల్లు, సెప్టెంబర్ 09(నేటి దర్శిని):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అనుచిత,అవమానకర వ్యాఖ్యలపై నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి బేగంబజార్ సెంట్రల్ జోన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ విమర్శల పరిధిని దాటి, వ్యక్తిగతంగా అవమానించేలా ఉన్నాయని ఎంపీ మల్లు రవి ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇలాంటి అవమానకర వ్యాఖ్యలు ప్రజా జీవితంలో ఉన్నా, రాజ్యాంగ బద్ధమైన పదవుల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, సంబంధిత వీడియోలు సోషల్ మీడియా ప్రచారానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచి,విచారణ చేపట్టాలని పోలీసు అధికారులను కోరారు. రాజకీయ విమర్శలకు ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ఉన్నప్పటికీ, వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలకు చట్టపరమైన హద్దులు ఉంటాయని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ మధుసూదన్ రెడ్డి, ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు తదితరులు పాల్గొన్నారు.'

## వేయిస్తంభాల ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**ఉమ్మడి వరంగల్, సెప్టెంబర్ 9 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోనిచారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆవిష్కరించారు. సెప్టెంబర్ 14 నుంచి 23వ తేదీ వరకునిర్వహించనున్న నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని ఎంపీ ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆలయంలోని శ్రీ రుద్రేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఎంపీకి వేద ఆశీర్వచనం అందించారు.ఆధ్యాత్మిక, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన వేయిస్తంభాల ఆలయంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఆకాంక్షించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి. అనిల్ కుమార్, ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ, మణికంఠ అవధాని, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అన్ని మతాలను గౌరవించాలి

● నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి: సబ్ కలెక్టర్ కరోలిన చింగ్టియాన్ మావి




**దేవరకొండ, సెప్టెంబర్ 9 (నేటి దర్శిని) :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవరకొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన చింగ్టియాన్ మావి మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వహించాలని సూచించారు. అన్ని మతాలను గౌరవిస్తూ పండుగలను సోదరభావంతో జరుపుకోవాలని ఆమె కోరారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా జలాశయాల వద్ద పటిష్టమైన బందోబస్తు, అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు పీస్ కమిటీ సమావేశంలో పాల్గొన్న రాజకీయ నాయకులు నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. రహదారుల వెంట వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని, రోడ్లకు ఇరువైపులా అవసరమైన చోట మట్టిని పోసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.మత సామరస్యంతో పండుగలు జరుపుకోవాలి వివిధ మతాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ ఏ మతానికి చెందిన పండుగ అయినా ఇతర మతాలను గౌరవిస్తూ, పరస్పర సహకారంతో శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. పండుగల సందర్భంగా ప్రజలు సంయమనం పాటిస్తూ పోలీసు, రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు, దేవరకొండ సీఐ, దేవరకొండ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు, పీస్ కమిటీ సభ్యులు, మత పెద్దలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## తీదేడులో బీజేపీ బ్యానర్ తొలగింపు వివాదం!

● బ్యానర్ తొలగింపుపై సమగ్ర విచారణ జరిపించాలి

● బాధ్యులెవరో తేల్చి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి

● గ్రామంలో ఉద్రిక్తతలకు తావులేకుండా శాంతిభద్రతలు కాపాడాలి: బీజేపీ నాయకులు

**చింతపల్లి మండలం, సెప్టెంబర్ 9 (నేటి దర్శిని):** చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో పండుగ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యుల ఫొటోలతో ఏర్పాటు చేసిన బ్యానర్ తొలగింపు వివాదం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. తమ అనుమతి లేకుండా బ్యానర్‌ను కొందరు వ్యక్తులు తొలగించారని ఆరోపించిన బీజేపీ నాయకులు.. ఈ ఘటనపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన బ్యానర్‌ను గ్రామ సర్పంచ్ భర్తగా పేర్కొంటున్న వ్యక్తి, అతని అనుచరులు తొలగించినట్లు తమ దృష్టికి వచ్చిందని నాయకులు తెలిపారు. అయితే ఈ అంశంపై పూర్తి వాస్తవాలు పోలీసుల విచారణలోనే తేలాల్సి ఉందని పేర్కొంటూ, ఘటనకు సంబంధించిన ప్రతి కోణాన్ని పరిశీలించాలని కోరారు.



అభ్యంతరం ఉంటే అధికారులను ఆశ్రయించాలి

బ్యానర్‌పై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గంలో సంబంధిత అధికారులను సంప్రదించాల్సి ఉంటుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. స్వయంగా బ్యానర్‌ను తొలగించడం ద్వారా గ్రామంలో అనవసర వివాదాలకు, ఉద్రిక్తతలకు దారితీసే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు.

సీసీటీవీ.. వీడియోలు పరిశీలించాలి

బ్యానర్‌ను ఎవరు తొలగించారు? ఏ కారణంతో తొలగించారు? అనే అంశాలపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి అందుబాటులో ఉన్న ఫొటోలు, వీడియోలు, సీసీటీవీ దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

విచారణలో బ్యానర్‌ను తొలగించి నష్టం కలిగించినట్లు నిర్ధారణ అయితే, వర్తించే చట్టాల ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలి

గ్రామంలో ఎలాంటి గొడవలు, ఉద్రిక్తతలకు తావులేకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికీ సమానంగా చట్టపరమైన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఘటనపై రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరారు.

పాల్గొన్న బీజేపీ నాయకులు

సముద్రాల నగేష్ --- మండల పార్టీ అధ్యక్షులు
శివర్ల రమేష్ --- కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
కుక్కడపు రామకృష్ణ --- జిల్లా కార్యవర్గ సభ్యులు
ఇడబోయిన వెంకటయ్య యాదవ్ --- ఉప సర్పంచ్
ధరణిపతి రమణారావు --- మాజీ ఉప సర్పంచ్
మర్ల యాదగిరి యాదవ్ --- వార్డు నెంబర్
గొడ్డటి మధు --- యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## చింతపల్లి పాఠశాలల్లో డీఈవో ఆకస్మిక తనిఖీలు

● విద్యార్థుల అభ్యాస స్థాయిపై ప్రత్యేక దృష్టి..

● రెమెడియల్ తరగతుల నిర్వహణపై సమీక్ష

**చింతపల్లి, సెప్టెంబర్ 9 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) సుసింధర్ రావు చింతపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, అభ్యాస స్థాయి, రెమెడియల్ తరగతుల నిర్వహణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.డీఈవో జడ్పీహెచ్ఎస్ చింతపల్లి, కేజీబీవీ చింతపల్లి, జడ్పీహెచ్ఎస్ కుర్మపల్లి, జడ్పీహెచ్ఎస్ కుర్మేడు, ఎంపీపీఎస్ కుర్మేడు గేట్, ఎంపీపీఎస్ చింతపల్లి పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న రెమెడియల్ తరగతులను పరిశీలించడంతో పాటు, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని స్వయంగా తెలుసుకున్నారు.

విద్యార్థులతో ముఖాముఖి

ఈ సందర్భంగా విద్యార్థులతో డీఈవో నేరుగా మాట్లాడి వారు చదువుతున్న పాఠ్యాంశాలపై అవగాహనను పరీక్షించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి రెమెడియల్ తరగతులను సమర్థవంతంగా నిర్వహించి అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించాలని ఆదేశించారు.






విద్యా ప్రమాణాల పెంపునకు చర్యలు

పాఠశాలల్లో బోధనాభ్యాస కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు నిరంతరం దృష్టి సారించాలని డీఈవో సూచించారు. పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల అభ్యాస ప్రగతి, అమలవుతున్న విద్యా కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు.

డీఈవో సుసింధర్ రావు పర్యటనలో చింతపల్లి మండల విద్యాధికారి శ్రీ ఎన్. అంజయ్య కలిసి పాఠశాలలను సందర్శించారు.

డీఈవో ఆకస్మిక తనిఖీల ద్వారా మండలంలోని పాఠశాలల్లో విద్యా కార్యక్రమాల అమలు, విద్యార్థుల అభ్యాస ప్రగతి, రెమెడియల్ తరగతుల నిర్వహణపై సమగ్రంగా సమీక్షించినట్లు మండల విద్యాధికారి ఎన్. అంజయ్య తెలిపారు.

